చదువులమ్మ ఒడిలో గండం..!

- శిథిలావస్థలో మున్సిపల్ గ్రంథాలయం
- పుస్తకాలు లేని దుస్థితి
- బీటలు వారిన గోడలు.. పెచ్చులూడి పడుతున్న శ్లాబ్
- అధికారుల నిర్లక్ష్యం

నిడదవోలు: పట్టణంలోని రైయిపేట రెల్వేస్టేషన్ సెంటర్‌లో ఉన్న మున్సిపల్ గ్రంథాలయం శిథిలావస్థలో కూలడానికి సిద్ధంగా ఉంది. 1979లో రాంపల్లి రాజ్యలక్ష్మీ మున్సిపల్ గ్రంథాలయాన్ని నిర్మించారు. అప్పట్లో గ్రంథాలయం పాఠకులతో కళకళలాడేది. పట్టణంలో మరో శాఖ గ్రంథాలయం ఉండడంతో దీని నిర్వహణపై అధికారులు అంతగా పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పర్యవేక్షణ కొరవడటంతో ప్రస్తుతం ఇది శిథిలావస్థకు చేరుకుంది. కేవలం ఇక్కడ వార్తా పత్రికలు తప్ప ఎలాంటి పుస్తకాలు అందుబాటులో లేవు. భవనంపై పిచ్చి మొక్కలు మొలిచి గదుల్లో పై శ్లాబ్ శిధిలమై కాంక్రీట్ పెచ్చులు ఊడిపడుతున్నాయి. మున్సిపల్ పాలకవర్గం నిర్లక్ష్యం కారణంగా అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందని స్థానికులు చెబుతున్నారు.

మద్యం అమ్మకాలు..

మున్సిపల్ గ్రంథాలయానికి అనుకుని నాలుగు అడుగుల దూరంలో మద్యం షాపు ఉండడంతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. మద్యం ప్రియులు గ్రంథాలయం ప్రహరీ గోడపై మద్యం సేవించడం అలవాటుగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం అంధురాలైన గ్రంథాఇలయాధికారి పనిచేస్తున్నారు. ఈమే సెలవు పెడితే మున్సిపల్ అటెండర్ వచ్చి తాళాలు తీస్తారు. గ్రంథాలయంలో అవసరమైన పుస్తకాలు లేకపోవడంతో పాఠకుల సంఖ్య తగ్గుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో గ్రంథాలయాన్ని పట్టించుకునే నాధుడే కరువయ్యారు. దీంతో మున్సిపల్ గ్రంథాలయం ఉందనే సంగతి పట్టణ ప్రజలు ఏనాడో మరిచిపోయారు.



శిథిలావస్థకు చేరుకున్న మున్సిపల్ గ్రంథాలయం



స్లాబ్ కుంగిపోయిన వైనం



భవనంపై పెరిగిన పిచ్చి మొక్కలు



గ్రంథాలయం ఆవరణలో నిర్మించిన ప్రభుత్వ పెన్షనర్ల కార్యాలయం

అందరూ అక్కడే

పట్టణంలో ఉన్న మరో శాఖాగ్రంథాలయంలో అన్ని సదుపాయాలు ఉన్నాయి. రోజుకి సుమారు 50 నుంచి 70 మంది పాఠకులు ఇక్కడికి వస్తుంటారు. విద్యార్థులు, నిరుద్యోగులు అధికంగా ఇక్కడకు వచ్చి పోటీ పరీక్షలకు సిద్ధపడుతున్నారు. ప్రజలు పన్నుల రూపంలో కట్టిన సొమ్ముతో పురపాలక సంఘానికి వచ్చే ఆదాయంలో గ్రంథాలయానికి పన్ను రూపంలో 8 శాతం చెల్లిస్తున్నారు. అయినా ఇక్కడ సరైన సదుపాయాలు లేకపోవడంతో స్థానికులు ఇక్కడికి రావడానికి ఆసక్తి చూపడం లేదని పలువురు వాపోతున్నారు.

గ్రంథాలయం స్థలం ధారాదత్తం

మున్సిపల్ గ్రంథాలయం మొత్తం 4.21 సెంట్ల విస్తీర్ణంలో ఉంది. గతంలో విశాలమైన గార్డెన్‌తో కళకళలాడేది. పాఠకులు వచ్చి కొంతసేపు ఇక్కడ సేద తీరే వారు. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతో గార్డెన్ మొత్తం పిచ్చి మొక్కలతో నిండిపోయింది. ఈ క్రమంలో రాష్ట్ర పెన్షనర్ల సంఘ సభ్యులకు గ్రంథాలయ ఆవరణలో ఉన్న స్థలంపై కన్ను పడింది. సంఘ సభ్యులు 2019లో అప్పటి మున్సిపల్ చైర్మన్ బొబ్బ కృష్ణమూర్తి హయంలో కార్యాలయం పెట్టుకుంటామని అభ్యర్థించారు. అప్పటి చైర్మన్ బొబ్బా కృష్ణమూర్తి కౌన్సిల్ ఆమోదంతో గ్రంథాలయం ఆవరణలో ఉన్న 3.52 సెంట్ల స్థలాన్ని కేటాయించడంతో రాష్ట్ర పెన్షనర్ల సంఘ కార్యాలయాన్ని పెన్సనర్లు నిర్మించుకున్నారు. అప్పటి నుంచి మున్సిపల్ పాలకవర్గం గ్రంథాలయ నిర్వహణను గాలికి వదిలేశారు.

నిడదవోలు మండలంలో విజ్జేశ్వరం, కాటకోశ్వరం, పెండ్యాల గ్రామాల్లో గ్రంథాలయాలను అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. సమిశ్రగూడెం గ్రామంలో ఉన్న గ్రంథాలయానికి మాత్రం పక్కా భవనం ఉంది. గ్రామాల్లో నిర్వహిస్తున్న గ్రంథాలయాల్లో పూర్తిస్థాయిలో పుస్తకాలు అందుబాటులో లేకపోవడంతో పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. చాలామంది పుస్తకాల కోసం నిడదవోలు వస్తున్నారు. పెరవలి మండలంలో తీపర్రు, పెరవలి, ముక్కామల గ్రామాల్లో ఉన్న శాఖ గ్రంథాలయాల్లో పూర్తిస్థాయిలో పుస్తకాలు అందుబాటులో లేవు. మండలం కేంద్రం ఉండ్రాజవరం గ్రామంలో ఉన్న శాఖా గ్రంథాలయంలో నిరుద్యోగులు చదువుకోవడానికి పోటీ పరీక్షల మెటీరియల్ అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని పుస్తకాలు ఏర్పాటు చేసి పాటకులకు మెరుగైన సేవలు అందించాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం

నల్లజర్ల: అనంతపల్లి శివారు సంజీవపురం సబ్ స్టేషన్‌లో మరమత్తులు, బ్రేకటింగ్స్, నిర్వహణ పనుల నిమిత్తం ఈ నెల 22వ తేది శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సంజీవపురం పరిధిలో అన్ని ఫీడర్లలో సరఫరాను నిలుపుదల చేయనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నారాయణ అప్పారావు తెలిపారు. తెల్లవారుజామున 3 గంటల నుంచి 8 గంటల వరకు తిరిగి మధ్యాహ్నం 2గంటల నుంచి 6 గంటల వరకు 3 ఫేస్ సరఫరా చేయనున్నట్లు వివరించారు.

విద్యుత్ నిలుపుదల

గోపాలపురం: మండలంలోని 33/11కేవీ జగన్నాధపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో చెట్లు తొలగింపు కార్యక్రమంలో భాగంగా ఈ నెల 22వ తేదీ శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 1 గంట వరకూ విద్యుత్ నిలుపుదల చేస్తున్నట్లు నిడదవోలు ఏడీఈ అప్పారావు బుధవారం తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని జగన్నాధపురం, కోమటికుంట, రేగులగుంట, కరిచర్లగూడెం, సంజీవపురం గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

ఉపాధ్యాయుడుకి జ్యూరీ అవార్డు ప్రదానం



శ్రీనివాసుకు సేవారత్న అవార్డు ప్రదానం చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

నల్లజర్ల: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేవిధంగా మంచినీటి చలివేంద్రాలు ఏర్పాటు చేయడం , విద్యలో ఉత్తమ ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు అందించడం, వైద్య శిబిరాలు నిర్వహించడం, బడి తర్వాత విద్యా బోధన,నిరుపేదలైన విద్యార్థుల తల్లిదండ్రుల వైద్యానికి ఆర్థిక సాయం అందించడం, వివిధ సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్న దూబచర్ల జెడ్పీ హైస్కూలు ఉపాధ్యాయుడు, అంబేడ్కర్ యూత్ వ్యవస్థాపకుడు బొందల శ్రీనివాసరావుకు విశ్వజననీ ఫౌండేషన్ సేవా రత్న అవార్డుకు ఎంపిక చేసి హైదరాబాదు పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలో బుధవారం అవార్డును సంస్థ చైర్మన్ బొగ్గారపు బ్రహ్మానందం ప్రదానం చేశారు. తమ ఉపాధ్యాయుడు చేసిన సేవలకు ఇప్పటికి గుర్తింపు వచ్చిందని విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, నల్లజర్ల సర్పంచ్ పల్లిజ్యోతి సుబ్బారావు, తదితరులు అభినందనలు తెలిపారు.

ధర్మ సమ్మేళనానికి తరలిరండి



సమావేశంలో మాట్లాడుతున్న రాధామనోహర్‌దాస్ తదితరులు

సీటీఆర్ఐ: స్వామిజీలతో హిందూ న్యాయవాదుల ధర్మ సమ్మేళనాన్ని సెప్టెంబర్ 14న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్టు ఫోరమ్ ఫర్ హిందూ లాయర్లు, ఇంటలెక్చువల్స్ కో ఆర్డినేటర్ జి.శ్రీకృష్ణకుమార్ వెల్లడించారు. పలువురు స్వామిజీలు, న్యాయవాదులు హాజరవుతారని తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 150 బార్ అసోసియేషన్ల నుంచి 1,500 మంది న్యాయవాదులతో పాటు ధర్మాన్ని కాపాడేందుకు కృషిచేస్తున్న స్వామిజీలు పెద్దఎత్తున హాజరవుతున్నారని వివరించారు. స్వామిజీలపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టి, ఆస్తుల పరిరక్షణ, ధర్మ పరిరక్షణ చేయడానికి కృషి చేస్తామన్నారు. అభయ్ హిందూ సేన వ్యవస్థాపకుడు రాధా మనోహర్ దాస్ మాట్లాడుతూ ధర్మం కోసం పనిచేసే న్యాయవాదులు దెవైం, దేశం కోసం పనిచేయడానికి ముందుకు రావాలన్నారు.

22 నుంచి సత్యసాయి కార్మికుల సమ్మె

గోపాలపురం: ఈ నెల 22వ తేదీ నుంచి సత్యసాయి మంచినీటి పథకం కార్మికులు సమ్మెకు సిద్ధమవుతున్నట్లు బుదవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత 10 నెలలుగా జీతాలు అందక నానా అవస్థలు పడుతున్నామని అధికారులకు, కూటమి ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోవడంతో సమ్మెకు సమాయత్తం అవుతున్నట్లు కార్మిక నాయకులు హెచ్చరించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలలో 17 మండలాలో 6 లక్షల మందికి సత్యసాయి మంచినీటి పథకం ద్వారా తాగునీరు అందిస్తున్న కార్మికులకు జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

పంట నమోదు తప్పనిసరి



పల్లంట్లలో రైతులతో మాట్లాడుతున్న ఏవో కమల్‌రాజ్

గోపాలపురం: రైతులు ఈ పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని తద్వారా ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు పొందే అవకాశం ఉంటుందని మండల వ్యవసాయాధికారి పి.కమల్ రాజ్ అన్నారు. దేవరపల్లి మండలం పల్లంట్ల గ్రామంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా ఏవో మాట్లాడుతూ వరి రైతులు ఘన యూరియాకి బదులు నానో యూరియాను ఉపయోగించాలని సూచించారు. రైతులకు అందుబాటులో మినుములు, రైజోబీయం కల్చర్ అందుబాటులో ఉన్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏఈఓటీ సంజన, స్థానిక రైతులు వ్యవసాయశాఖ, ఉద్యానశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచ శాంతి వర్ధిల్లాలి



శాంతి ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

ఉండ్రాజవరం(నిడదవోలు): సమాజంలో పేద వర్గాలు, దివ్యాంగులను దాతల సహకారంతో మానవత సేవా సంస్థ ఆదుకుంటుందని ఉండ్రాజవరం మండల మానవత సంస్థ శాఖ డైరెక్టర్ కఠారి సిద్ధార్థరాజు అన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండలంలోని సూర్యారావుపాలెం గ్రామంలో బుధవారం ప్రపంచా శాంతిని కాంక్షిస్తూ శాంతి ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు యుద్ధం వద్దు - శాంతి ముద్దు, ప్రపంచ శాంతి వర్ధిల్లాలి, మానవ సేవయే - మాధవ సేవ అంటూ నినదించారు. ఈ కార్యక్రమంలో తాతిని వెంకట కృష్ణారావు, వెలిచేటి బోస్, ఉప్పలపాటి శ్రీనివాస్, హెచ్‌ఎం జి.పౌలుప్రకాశం, కోట రామప్రసాద్, రుద్రు ధనసరసింహారావు, అన్నే వెంకటేశ్వరరావు, నగుబత్తుల దుర్గారావు, దూది సూర్యనారాయణ, సుంకవల్లి వెంకటేశ్వరరావు, వాకలపూడి రామకృష్ణ, పైపూరి మాణిక్యాలరావు, వీరవల్లి వెంకట సుబ్బారావు, పి.తాతారావు పాల్గొన్నారు.

టిప్పర్ లారీ కార్యవర్గ ప్రమాణ స్వీకారం



దొమ్మేరులో ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

తాళ్లపూడి(కొవ్వూరు): మండలానికి చెందిన శ్రీ దుర్గా భవాని టిప్పర్ లారీ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం దొమ్మేరులో జరిగింది. గౌరవ అధ్యక్షుడు ఉప్పులూరు వెంకట ఫణి కృష్ణారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వేద మంత్రాల మధ్య కొవ్వూరు మండల నూతన కార్యవర్గం సభ్యులు రెండు సంవత్సరాల కాల పరిమితికి ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్షుడిగా రాచూరి శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్‌గా మడిచర్ల వెంకటేష్, సెక్రెటరీ పాపోలు వీర వెంకట సత్యనారాయణ, జాయింట్ సెక్రెటరీగా దార్ల నాగ లక్ష్మిప్రసాద్, ట్రెజరర్‌గా వీరాబత్తుల మణికంఠ, సభ్యులుగా ఆరు గొలును సత్యనారాయణ, వనచర్ల మోహన్, భీమడోలు శ్రీకాంత్, చెరుకు అయ్యప్ప, గోండేపల్లి సత్యనారాయణ, వెత్సా శేషగిరి సలహాదారుడు పెరుగు సాంబశివరావులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో దేవరపల్లి యూనిట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సిహెచ్ వెంకటరమణ, కొవ్వూరు రూరల్ సీఐ విజయబాబు, కొవ్వూరు పట్టణ సిఐ విశ్వం, రూరల్ ఎస్సై శ్రీహరి పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

చాగల్లు: వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు చాగల్లు ఎస్సై కె.నరేంద్ర బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. చాగల్లుకు చెందిన రాగిరెడ్డి శ్రీనివాసరావు మంగళవారం రాత్రి రాజమండ్రి వెళ్లి సరుకులు తీసుకువస్తానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లాడన్నారు. ఎంత సేపటికి రాకపోయే సరికి చుట్టుపక్కల, బంధువుల ఇంటివద్ద ఆచూకీ కోసం ప్రయత్నించగా, ఫలితం లేకపోవడంతో బుధవారం శ్రీనివాసరావు సోదరుడు రాగిరెడ్డి ఆంజనేయులు ఫిర్యాదు చేసినట్లు వివరించారు. శ్రీనివాసరావుకు ఇద్దరు కుమారులు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారని ఎస్సై తెలిపారు. దర్యాప్తు చేస్తున్నామన్నారు.

దోమల లార్వా నిర్మూలనకు చర్యలు



కానూరులో లార్వా నిర్మూలనకు గంబూషియా చేపలను వదులుతున్న సిబ్బంది



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



దోమల నిర్మూలనపై సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న డాక్టర్

పెరవలి: ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా మండలంలో బుధవారం పెరవలి కానూరు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్లు ఆర్ఎస్ఎస్‌వి ప్రసాద్, కె.హేమరాజు ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించి మురుగు కుంటల్లో చేప పిల్లలను వదలారు. అనంతరం వారు మాట్లాడుతూ 1897లో మలేరియా జ్వరానికి కారణమైన క్యూలిసిన్ దోమలను గుర్తించి వాటి ద్వారా మలేరియా వ్యాప్తి ఎలా జరుగుతుందో ప్రపంచానికి తెలియపరిచిన మహానీయుడు రోనాల్డ్ రాస్ అని కొనియాడారు. అనంతరం రోనాల్డ్ రాస్ చిత్రపటానికి పూలమాలల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో కానూరు సర్పంచ్ భావన పూర్ణచందు మధు, కోలా సీతయ్య నాయుడు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

నిడదవోలు: ప్రపంచ దోమల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉండ్రాజవరం పీహెచ్‌సీ వైద్యాధికారి దుర్గా మహేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం వైద్య సిబ్బంది దోమల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ దుర్గా మహేశ్వరరావు మాట్లాడుతూ వర్షా కాలంలో లోతు ఎక్కువ ఉన్న ప్రదేశాలు, వాడి పడేసిన ఖాళీ డబ్బాలు, ప్లాస్టిక్ కవర్లు, టైర్లు, ఫ్రిడ్జ్ వెనుక భాగంలో ఉండే వేస్ట్ కలెక్షన్ నీరు 10 రోజులు మించి నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెందుతాయన్నారు. వాటి ద్వారా మలేరియా, చికెన్ గునియా, డెంగీ, ఫైలేరియా వ్యాధులు సంక్రమిస్తాయన్నారు. నీటిని నిల్వ లేకుండా చూసినట్లయితే దోమల వ్యాప్తి ఉండదన్నారు. వారానికి ఒకసారి ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా ఉంచుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఎం.సుబ్రహ్మణ్యం, కె. కుమారి, ఎస్. శ్రీరామమూర్తి, నారాయణరెడ్డి, బ్యూలా, ఝాన్సీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

దోమకాటు ప్రాణాంతకం

నల్లజర్ల: ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా నల్లజర్ల, పోతవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో బుధవారం దోమల నివారణపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. నల్లజర్ల పీహెచ్‌సీ డాక్టరు గంగాధరరావు మాట్లాడుతూ పరిశుభ్రత లోపంతోనే దోమలు రోజురోజుకు ఉధృతి చెందుతాయన్నారు. క్యూలెక్స్ అనే ఆడదోమ కుట్టడంతో మెదడు వాపు, ఏడిస్ ఈజిప్టి దోమ ద్వారా డెంగీ, మలేరియా, చికున్‌గున్యా వ్యాధులు సంక్రమిస్తాయన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు రాత్రివేళ తొందరగా దోమలు ఇంట్లోకి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీహెచ్ఓ వెంకటశాస్త్రి, పీహెచ్ఎన్ పారమ్మ, జీవివి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. పోతవరం పీహెచ్‌సీ పరిధిలో డాక్టరు సిరాజుద్దీన్ ఆధ్వర్యంలో దోమల నిర్మూలన వ్యాప్తిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్లు యం.జయప్రకాష్, ఎంపీహెచ్ఎస్ మీరాబాయ్, ఎఎంఎలు, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

తానేటి వనితకు నాయకుల పరామర్శ



తానేటి వనితను పరామర్శిస్తున్న నల్లజర్ల మండల పార్టీ నాయకులు

నల్లజర్ల: మాజీ మంత్రి తానేటి వనిత మావగారు తానేటి బాబూరావు మంగళవారం మృతి చెందగా బుధవారం అంత్యక్రియలను పాలకొల్లు శివారు పూలపల్లిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నల్లజర్ల మండలం నుంచి కార్యకర్తలు, నాయకులు హాజరయ్యి ఆమెను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ వెల్లంకి వెంకట సుబ్రమణ్యం, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు నక్కాపండు, బళ్లనాని, వైస్ఎంపీపీ అచ్యుత శివాజీ, అచ్యుత వెంకటస్వామి (పెద కాపు) మండల బీసీ సెల్ అధ్యక్షుడు చిన్నీనాగూ యాదవ్, శ్రీకాకుళపు ఆదిత్య, సాంబశివనాయుడు, మలుకుర్తి పెద్దిరాజు, భీమడోలు వెంకటేశు తదితరులున్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

బిక్కవోలు: యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వాసంశెట్టి రవిచంద్రకుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ బిక్కవోలుకు చెందిన కొమ్ము రాణి కుమార్తె ఈ నెల 19న అదే గ్రామానికి చెందిన తన పిన్ని మాణిమాలకు ఇంటికి వెళ్లింది. చీకటి పడినా తన కుమార్తె తిరిగి రాక పోవడంతో రాణి తన చెల్లి, బంధువుల ఇంటివద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నేటి నుంచి 'తెలుగు మాటల పండగ'



సమావేశంలో పాల్గొన్న కార్యనిర్వాహక వర్గం సభ్యులు

సీటీఆర్ఐ: తెలుగు భాష దినోత్సవం సందర్భంగా ఈనెల 29న తెలుగు సారస్వత పరిషత్, కళా గౌతమి, సంయుక్త నిర్వహణలో వారం రోజుల పాటు తెలుగు మాటల పండగ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కార్యనిర్వాహక వర్గం సభ్యులు తెలిపారు. బుధవారం స్థానిక సప్పా దుర్గాప్రసాద్ నాట్య నృత్య కళానికేతన్‌లో నిర్వహించిన సమావేశంలో వారు వివరాలను వెల్లడించారు. జక్కంపూడి విజయలక్ష్మి, డాక్టర్ బీఎస్ఎన్ మూర్తి, డాక్టర్ సప్పా దుర్గాప్రసాద్, డాక్టర్ పీవీబీ సంజీవరావు, డాక్టర్ బి.హెచ్‌వీ రమాదేవి, చిర్ల సీతారామనాయుడు కార్యనిర్వాహక వర్గం సభ్యులుగా ఉన్నారని తెలిపారు. ఈనెల 21న ఉదయం 10.30 గంటలకు ఆనం కళాకేంద్రం నన్నయ్య విగ్రహం నుంచి రాజరాజ నరేంద్రుని విగ్రహం వరకు అక్షర దేవతల ఊరేగింపు, 22న జానపద దినోత్సవం సందర్భంగా నేదునూరి గంగాధరం జయంతి నిర్వహిస్తామన్నారు. 23న కళాశాల విద్యార్థులకు ప్రశ్నావళి పోటీ, అన్నమాచార్య కీర్తనలతో అంత్యాక్షరి పాటల పోటీ, 24న తెలుగు పేరంటం, సప్త నదుల జలాలతో గోదావరి మాతకు పూజను నిర్వహిస్తామన్నారు. 25న తెలుగు పరిరక్షణలో తల్లుల పాత్ర అంశంపై మహిళలకు చర్చ, 26న మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక సంహిత కళాశాలలో విద్యార్థులకు పద్య నిధి ప్రసిద్ధ కావ్యాలు, నాటకాలలోని పద్యాలను ఆలపించడం, 27న తెలుగు కళారూపాల ప్రదర్శన, 28న ఉపాధి మార్గం దిశగా తెలుగు అంశంపై చర్చ నిర్వహిస్తామన్నారు. 29న సంహిత డిగ్రీ కళాశాల విద్యార్థులతో గుమిగూడు ఆట (ఫ్లాష్ మాబ్) తెలుగు పాటల ఆలాపన తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

పాలకుల నిర్లక్ష్యంతో నరకయాతన



కొవ్వూరుపాడు, సాగిపాడు మధ్య అధ్వాన్నంగా ఉన్న రహదారి



కరగపాడు అధ్వాన్నంగా ఉన్న రోడ్డు

గోపాలపురం: మండలంలోని గ్రామీణ ప్రాంతాల రోడ్లు అధ్వాన్నంగా తయారైయ్యాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గ్రామాల్లోని రోడ్లు ఛిద్రంగా తయారయ్యాయి. కరగపాడు, బుచ్చింపేట, రాంపాలెం, కొవ్వూరుపాడు గ్రామాల మధ్య రోడ్లు గోతుల పడటంతో వాహనదారులు, పాదచారులు నానా అవస్థలు పడుతున్నారు. కరగపాడు గ్రామానికి వెళ్లే రోడ్డుపై నడకదారి కూడా లేకుండా గోతులుపడి నీరు చేరింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొవ్వూరుపాడు నుంచి దొండపూడి వెళ్లే రోడ్డు అల్లికాలువ వద్ద వర్షానికి దెబ్బతినడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని వాహనదారులు వాపోవుతున్నారు. గోపాలపురం నుంచి కొయ్యలగూడెం వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతినడంతో భారీ వాహనదారులు వాహనాలు దెబ్బతినడంతో రోజులు తరబడి నిలిచిపోతున్నాయి. దీంతో నిత్యం రద్దీగా ఉంటే రహదారిలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర దాటుతున్నా గ్రామీణ రహదారులపై ఇటు అధికారులు కానీ ప్రజాప్రతినిధులు కానీ దృష్టి సారించడం లేదని గ్రామీణ ప్రాంతాల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నిధులు లేవంటున్నారు



కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర అవుతున్నా గ్రామీణ ప్రాంతాల రోడ్లు పట్టించుకోవడం లేదు. ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా నిధులు లేవని చెబుతున్నారు తప్ప సమస్య పరిష్కారానికి కృషి చేయడం లేదు. అధికారులు, ప్రజా ప్రతినిధులు ఈ రోడ్డులో ప్రయాణిస్తే అప్పుడు ప్రజల సమస్యలు తెలుస్తాయి.

– ఎస్.జోషఫ్ కుమార్, వాహనదారుడు, బుచ్చియ్యపాలెం